క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఉసేన్‌స్వామి ఉరుసు



భక్తులతో కిటకిటలాడుతున్న ఉసేన్‌స్వామి దర్గా

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు ఉసేన్ స్వామి దర్గాలో గురువారం ఉరుసు ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాలకు జిల్లాతోపాటు, కర్నూలు, వైఎస్సార్, అనంతపురం, తదితర జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దర్గా కిటకిటలాడింది. ఉసేన్‌స్వామికి భక్తులు జెండాలు, పూలదట్టీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా నరసింహస్వామి జయంతి

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీ సమీపాన కొండపై వెలసిన గట్ల నరసింహ స్వామి ఆలయంలో వైశాఖ మాసం నరసింహ స్వామి జయంతి సందర్భంగా భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులు లక్ష్మీ సమేత నరసింహస్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రామమందిర నిర్మాణంలో భాగస్వాములు కండి

డోన్ టౌన్: అయోధ్యలో నిర్మిస్తున్న రామమందిర నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆవోపా అధ్యక్ష కార్యదర్శులు మాకం కృష్ణకిషోర్, జోన్నల గడ్డ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం వారు విలేకరుల తో మాట్లాడుతూ శ్రీరామనామం జపిస్తు రాసే రామకోటి పుస్తకాలను ఆవోపా ద్వార భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. రామకోటి రాసిన పుస్తకాలను కర్నూలు ఆవోపా ద్వారా రామజన్మ భూమి అయోధ్యలో నిర్మిస్తున్న శ్రీరామ మందిర నిర్మాణ సంస్థకు పంపుతున్నట్లు తెలిపారు. రామకోటి రాయదలచుకున్న భక్తులు డోన్,కర్నూలు ఆవోపా సంఘాలను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి కనకదుర్గ ఆలయ వార్షికోత్సవం

ప్యాపిలి: స్థానిక బాలుర వసతి గృహం వద్ద నిర్మించిన శ్రీకనకదుర్గాదేవి ఆలయం 25వ వార్షికోత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం గణపతి పూజ, స్వస్తవాచనం, కళశ స్థాపన, మహా మంగళ హారతి తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. శనివారం చండీ పారాయణం, చండీ హోమం, పూర్ణాహుతి, మహా మంగళ హారతి తదితర పూజలు, ఆదివారం లలిత సహస్త హోమం, దుర్గా హోమం, లఘు పూర్ణాహుతి తదితర పూజలు ఉంటాయన్నారు.ముగింపు రోజు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మే 8 నుంచి గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు

బేతంచెర్ల: వేసవి సెలవుల సందర్భంగా మే 8 నుంచి జూన్ 11 వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు గ్రంథాలయ అధికారి మధు శేఖర్ గురువారం తెలిపారు.విద్యార్థులకు స్పోకన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, క్యారమ్, చెస్, షటిల్ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు.అదేవిధంగా మంచి కథలు, మేధస్సుకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

వీడని అకాల వర్షాలు

కోవెలకుంట్ల: వేసవిలో అకాల వర్షాలు ప్రజలను వెంటాడుతున్నాయి.గురువారం సాయంత్రం స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. అకాలవర్షంతో వరి, మిరప రైతులకు నష్టం వాటిల్లింది. ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వరి కోత, నూర్పిడి దశలో ఉండగా అకాలవర్షంతో పైరు నేలవాలింది. మిరపలో చివరి కోత దిగుబడులు తడిచిపోకుండా పట్టలు కప్పుకుని కాపాడుకున్నారు.అకాల వర్షాలతో వాతావర ణం చల్లబడి ప్రజలు ఎండ నుంచి ఉపశమనం పొందారు.

రేషన్ బియ్యం స్వాధీనం

సంజామల(కోవెలకుంట్ల): సంజామల పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగాతరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రతాప్ తెలిపారు. బనగానపల్లెకు చెందిన పుల్లయ్య, సురేష్ అనే వ్యక్తులు సంజామల మండలంలో వివిధప్రాంతాల్లో రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తుండగా పోలీసులు దాడి చేశారు. పేరుసోముల-రామిరెడ్డిపల్లె గ్రామాల మధ్య గాలేరు వంతెన వద్ద ఆటోను స్వాధీనం చేసుకుని బియ్యం త రలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

18న సీపీఐ బహిరంగ సభ

డోన్ టౌన్: పట్టణంలో ఈనెల 18వ తేదీన డోన్ పట్టణంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక నక్కిరామన్న భవన్‌లో గురువారం నియోజకవర్గ కార్యదర్శి పులిశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సభలో చర్చించి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

వేసవి దుక్కులు... సాగుకు మేలు!

- లోతు దుక్కులతో ఎంతో ప్రయోజనం
- చీడ,పీడ పురుగుల నివారణకు ఆస్కారం
- దిగుబడులు పెరిగేందుకు దోహదం



వాలుకు అడ్డంగా రబీ సీజన్‌తరువాత నాగళ్లతో దుక్కులు దున్నుతున్న దృశ్యం

బనగానపల్లె: వ్యవసాయ రంగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యనిస్తుంది. పెట్టుబడి సాయం అందజేయడంతోపాటు దిగుబడులకు మద్దతు ధర కల్పిస్తూ అన్నివిధాలుగా రైతులకు అండగా నిలుస్తుంది ప్రభుత్వం. అదేవిధంగా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఆర్బీకే, వ్యవసాయ, ఉద్యాన శాక అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు రైతులకు సూచనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారుల సూచనల మేరకు రైతులు వేసవి దుక్కులు చేపడుతున్నారు. రబీ పంట కోతల అనంతరం వర్షాలు కురిసేంత వరకు నేలను దుక్కులు చేయకుండా వదిలేస్తే భూములు నిర్జీవంగా మారుతాయి. ప్రతి రైతు వేసవి దుక్కులు చేపడితే ఎన్నో ప్రయోజనలు ఉంటాయని అధికారులు సూచిస్తున్నారు. రెండు నాగళ్ల ట్రాక్టర్‌తో దుక్కులు చేపడితే బాగుంటుంది. వేరుశనగ, పప్పు శనగ, మిరప, కంది తదితర పంటలను ఆశించే పచ్చపురుగు, లద్దెపురుగులు వంటివి భూమిలో ఉంటాయి. వేసవిలో లోతుగా దుక్కులు చేయడం మూలంగా చీడపురుగుల కోశాలు గుడ్లు బయటపడి వేడికి చనిపోతాయి. సమగ్రసస్యరక్షణ పద్ధతుల్లో భాగంగా వేసవిలో లోతుదుక్కులను చేయడంతో పురుగు మందుల ఖర్చు తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. రబీ పంటలు కోసిన తరువాత వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. వర్షాలకు ముందు భూమిని దున్నితే తొలకరి వర్షాలు పడగానే నీరు నేలలోకి ఇంకుతుంది. ఈ దుక్కుల వల్ల ఇతర గడ్డి జాతి మొక్క విత్తనాలు కూడా వేసవి ఉష్ణోగ్రతలకు మొలచే శక్తిని కొల్పోతాయి. వేసవి దుక్కులు చేయడానికి మే నెల అనువైన సమయం. వేరుకుళ్లు తెగుళ్లను కలిగించే శిలింద్ర సిద్ధ బీజాలు నిరంతరం భూమి అడుగు భాగానే ఉంటూ వర్షాపడగానే విజృభించి పంటలను నాశనం చేస్తాయి. అదే విధంగా భూమి అడుగుభాగాన ఉన్న గడ్డి మూలాలు వర్షాపడగానే పెరిగిన పంటను దెబ్బతిస్తాయి. వీటిని నివారించడానికి వేసవి సమయంలో ఒకటిన్నర ఆడుగులోతు వరకు దుక్కులు చేపట్టాలి. భూమి లోపాల ఉన్న శిలింద్ర సిద్ధబీజాలతో పాటు గడ్డి మూలాలు కూడా బయటిపడి అధిక ఉష్ణోగ్రతకు నశించిపోతాయి. భూమి పొడిగామారి వర్షం పడినప్పుడు గాలి, నీరు ఉష్ణోగ్రత సమానంగా ఇంకిపోయి విత్తనాలు మొలకెత్తేందుకు అనుకూలంగా ఉంటుంది.

పశువుల ఎరువుతో మేలు

దుక్కుల అనంతరం ఎకరాకు రెండుటన్నుల ప్రకారం పశువుల ఎరువు పొలంలో చల్లుకోవాలి. దీనితో పంటకు కావాల్సిన సూక్ష్మపోషకాలు కూడా సమృద్ధిగా అందుతాయి. పశువుల ఎరువు వల్ల భూసారం తగ్గకుండా అధిక దిగుబడులు లభించేందుకు వీలుగా ఉంటుంది. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి పశువుల ఎరువును తప్పకవాడాలి.

భూసారం పెరుగుతుంది



వేసవి దుక్కులతో భూసారం పెరుగుతుంది. భూమిలో ఉన్న చీడపురుగుల గుడ్లు బయటపడి నశిస్తాయి. తద్వారా పురుగు మందులవాడకం తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. రబీ పంటల కోత తరువాత వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. తొలకరి వర్షాలు పడినప్పుడు భూమిలోకి నీరు ఇంకి పోయి నేలసారవంతం అవుతుంది. అదేవిధంగా ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. ఇందు కోసం ఆర్‌బీకేలోని వ్యవసాయ అసిస్టెంట్లను రైతులు సంప్రదించాలి.

– సుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి బనగానపల్లె మండలం

కనుల పండువగా చెన్నకేశవుడి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అవుకు: శ్రీ భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి తిరుకల్యాణ మహోత్సవాల సందర్భంగా గురువారం స్వామి, అమ్మవార్ల కల్యాణం కనుల పండుగగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు రమణాచార్యులు, వేదపండితుడు సంపత్ శర్మ, అర్చకులు సాయికేశవాచార్యులు, శ్రీధర్ వర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రైతుసంఘం పెద్దలు, చెన్నకేశవ స్వామి భక్త బృంధం పూజలు నిర్వహించారు.

డోన్ : మండలంలోని యాపదిన్నెలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవం గురువారం కనుల పండువగా జరిగింది. వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య అశేష భక్తజన వాహిని సమక్షంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలికించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు టమటంది నేష్‌గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

అవుకు: ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత విద్య పొందేందుకు విద్యార్థుల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ 6వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్ రావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు 2023–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రస్తుతం 1వ తరగతి చదవాలనుకునే విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలు ఉచితంగా ప్రవేశాలు కల్పిస్తాయని తెలిపారు. విద్యార్థుల తరుపున ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుందని అన్నారు. ఈ నెల 15వరకు అవకాశం ఉందని, ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కబడ్డీ విజేత ప్యాపిలి

ఓర్వకల్లు: మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన కబడ్డీ పోటీలలో ప్యాపిలి జట్టు విజేతగా నిలిచింది. గ్రామంలోని చెన్నకేశవస్వామి తిరునాల సందర్భంగా నిర్వహించిన పోటీలను ఎస్ఐ మల్లికార్జున ప్రారంభించారు. ప్యాపిలి జట్టు ప్రథమ స్థానం సాధించి రూ.30 వేలు దక్కించుకుంది. తిమ్మాపురం జట్టు రెండవ స్థానంలో గెలిచి రూ.20 వేలు, శకునాల జట్టు మూడో స్థానంలో నిలిచి రూ.10 వేలు, పుల్లూరు జట్టు నాల్గవ స్థానంలో నిలిచి రూ.5 వేలను దక్కించుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ వాసుదేవరెడ్డి, స్థానిక నాయకులు శంకర్‌రెడ్డి, ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, పీఎంసీ చైర్మన్ మద్దిలేటి పాల్గొన్నారు.

నెరవేరిన పట్ర గొల్లల కల



పట్ర(గొల్లలు) కులస్తులకు బీసీ 'ఏ' సర్టిఫికెట్‌లను అందజేసిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

- బీసీ 'ఏ' సర్టిఫికెట్‌లను అందజేసిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

డోన్:ఎట్టకేలకు పట్ర(గొల్లలు)కులస్తులకు బీసీ'ఏ' సర్టిఫికెట్‌లను రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి అందజేశారు.ప్యాపిలి మండలం చంద్రపల్లె గ్రామంలో సర్పంచ్ జొన్నగిరి జయమ్మ ఆధ్వర్యంలో బుధవారం జరిగినకార్యక్రమంలో మంత్రి బుగ్గన పట్ర గొల్లలకు లాంఛనంగా రెవెన్యూ అధికారులు జారీ చేసిన బీసీ ఎ' కుల సర్టిఫికెట్‌లను అందజేశారు. కుల ధ్రువీకరణ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డిని సర్పంచ్‌తో పాటు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తలుపుల శ్రీనివాసుల నాయుడు, సంఘం పెద్దలు పెద్ద గువ్వల పంచ లింగేశ్వర,పసుపల రాములు తదితరులు ఘనంగా సన్మానించారు. మంత్రికి నాయకులు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు.

అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు

- 2024 ఎన్నికల్లో 175 స్థానాల్లో విజయం సాధిస్తాం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



నందవరంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: అన్ని సమాజిక వర్గాలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కిందని, ప్రజల మద్దతో 2024 ఎన్నికల్లో 175 స్థానాల్లో విజయం సాధిస్తామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నందవరం గ్రామంలో రెండవ రోజు గురువారం ఎమ్మెల్యే కాటసాని గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ దూదేకుల ఖైరూన్‌బీ, ఎంపీటీసీ సభ్యురాలు సుజాత, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పీఆర్ మురళీమోహన్‌రెడ్డి, పీఆర్ వెంకటేశ్వరరెడ్డి, తులసిరెడ్డి చిన్నిఓబులరెడ్డి, దశరథ రామిరెడ్డి తదితరులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పథకాలు అందాయా... లేదా... పాలన ఎలా ఉంది అని ఎమ్మెల్యే ఆరా తీశారు. అన్ని రకాల సంక్షేమ పథకాలు అందాయని ఆయా కుటుంబాల సభ్యులు ఎమ్మెల్యే ఎదుట సంతృప్తి వ్యక్తం చేశారు. అర్హత ఉండికూడా పథకాలు వర్తించకుంటే తమ దృష్టి తేవాలని, ఇక్కడికిక్కడే అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని కాటసాని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడే నాయకుడని, పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98శాతం అమలు చేశారని గుర్తు చేశారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో నియోజకవర్గంలో 92శాతం ప్రజలు ప్రభుత్వ తీరుకు మద్దతు తెలిపి రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిపారని గుర్తు చేసిన ఎమ్మెల్యే ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇన్ని రోజులు పలు కారణాలు చూపుతూ తప్పించుకొని తిరుగుతున్న చంద్రబాబు, నాయకులు అక్రమాలపై స్టేలను సుప్రీంకోర్టు కొట్టివేస్తూ విచారణకు ఆదేశాలు జారీ అభినందనీయమని, తెలుగుతమ్ముళ్ల అక్రమాలు బయట పడుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి కృష్ణ, మండల ఏఈ రమణ, హౌసింగ్ ఏఈ భాస్కర్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, పీరా సుబ్రహ్మణ్యం, మారుతి, లోకేశ్వరరెడ్డి, రామేశ్వరరెడ్డి, చెన్నరెడ్డి, నరసింహారెడ్డి, పార్థసారథిరెడ్డి, భక్తవత్సల రెడ్డి శేషశేయనారెడ్డి, గోపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రంగ రావు, వడ్డె సుబ్బరాయుడు,వడ్డె కుళ్లాయి, పూలరాజు, బాలయ్య, ఖాసీం, చింతమాను ఆదం, జిల్లెల్ల వలి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



సీడీపీఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు స్థానిక కార్యాలయం వద్ద సీడీపీఓ శంషాద్ బేగానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, నియోజకవర్గ అధ్యక్షురాలు మనోహరమ్మ, రహమత్‌బీ, కార్యదర్శి సులోచన మాట్లాడారు. పిల్లల ఆధార్‌కార్డు, పుట్టిన తేదీల నమోదు నిమిత్తం మరింత సమయం పెంచాలన్నారు. 62 సంవత్సరాలకు రిటైర్మెంట్ ఇవ్వాలని, నెలకు రు.6వేల పెన్షన్ అందజేయాలని, బకాయి ఉన్న వేతనాలు చెల్లించాని కోరారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి విజయలక్ష్మీ, ట్రెజరర్ రమాదేవి, సభ్యులు, రహమత్‌బీ, వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సన్నజీవాల పెంపకంలో మెలకువలు పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శాంతయ్య

బనగానపల్లె రూరల్: సన్నజీవాల పెంపకంలో మెలకువలు పాటించాలని ప్యాపిలి గొర్రెల పెంపకందార్ల శిక్షణా కేంద్రం ఉపసంచాలకులు డాక్టర్ శాంతయ్య సూచించారు. గురువారం స్థానిక పశువైద్యశాలలో జాతీయ పశుగణ మిషన్, ప్యాపిలి గొర్రెల పెంపందారుల శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో సన్నజీవాల పెంపకందార్లుకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ శాంతయ్య మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతోపాటు కొద్దిపాటి గొర్రెలు,మేకల పెంపకం చేపట్టాలని, తద్వారా రైతులకు అధనపు ఆదాయం వస్తుందన్నారు. పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ రామసుబ్బారెడ్డి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మారుతి సకారామ్ గొర్రెలు, మేకల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటికి సోకే సీజనల్ వ్యాధులు, నివారణ చర్యలు వివరించారు.

రేపు అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

బనగానపల్లెరూరల్: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కోవెలకుంట్ల, అవుకు, సంజామల, కొలిమిగుండ్ల, బనగానపల్లె మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 6వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. గురువారం కోడిగుడ్ల స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. వర్కర్ పోస్టులు పాతపాడు అంగన్‌వాడీ సెంటర్-2(బీసీ-సీ), లింగంబోడు ఓసీ(ఈడబ్ల్యూఎస్) గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున ఉండగా అభ్యర్థులు ఎవరు దరఖాస్తు చేసుకోలేదన్నారు. అలాగే ఆయా పోస్టులకు చెన్నంపల్లె అంగన్‌వాడీ సెంటర్‌కు మూడు, కోవెలకుంట్ల పట్టణంలోని 7వ అంగన్‌వాడీ సెంటర్‌కు మూడు, కోవెలకుంట్ల -8వ సెంటర్‌కు ఒక దరఖాస్తు, పేరుసోముల -3వ సెంటర్ ఎస్టీకి కేటాయించగా ఎవరు దరఖాస్తులు చేసుకోలేదని, బనగానపల్లె మండలం పెద్దరాజుపాళెం సెంటర్‌కు మూడు దరఖాస్తులు రాగా, కోరుమానుపల్లె సెంటర్, హనుమంతుగుండం అంగన్‌వాడీ సెంటర్లకు అభ్యర్థులు ఎవరు దరఖాస్తు చేసుకోలేదన్నారు. నంద్యాల ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో తప్పనిసరిగా హాజరు కావాలని సీడీపీఓ సూచించారు.

కోలుకోలేక యువతి మృతి

బేతంచెర్ల: పట్టణంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన ఓ యువతి తనకు ఇష్టంలేని పెళ్లి చేస్తూన్నారని గత నెల 16వ తేదిన పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. హెడ్ కానిస్టేబుల్ బాలజీ సింగ్ వివరాల మేరకు ముంగాల సుబ్బరాయుడు కుమార్తె సుజాతకు వివాహం నిశ్చయించారు. ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా కోలుకోలేక సుజాత (22) మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ గురువారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- అవుకు ఆర్‌అండ్‌బీ రహదారిలో గురువారం జరిగిన ప్రమాదంలో ఓ మహిళ గాయపడింది. అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన సుభానీ తన భార్య చిన్నదస్తగిరమ్మ ఇద్దరు పిల్లలతో బైక్‌పై కోవెలకుంట్ల మండలం రేవనూరు ఉసేన్‌స్వామి దర్గాకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుంతుండగా పట్టణ శివారులోని రైల్వేవంతెన సమీపంలో బైక్ వెనుక కూర్చున్న చిన్నదస్తగిరమ్మ జారి కింద పడడడంతో గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది ఆమెను కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా ప్రాథమిక చికిత్స అనంతరం నంద్యాలకు తరలించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

కోవెలకుంట్ల: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని రేవనూరు ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ హెచ్చరించారు. గురువారం పోలీస్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు పొలాల్లో మద్యం సేవిస్తుండటంతో దాడులు నిర్వహించారు. బహిరంగంగా మద్యం సేవిస్తున్న పదిమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కోడి గుడ్ల స్టాక్ పరిశీలన

బనగానపల్లెరూరల్: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేయు కోడిగుడ్ల స్టాక్ పాయింట్‌ను గురువారం సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ తనిఖీ చేశారు. గుడ్డు సైజ్, బరువుతో పాటు నాణ్యతను పరిశీలించారు. అదేవిధంగా గోడౌన్ ఉన్న స్టాక్, రిజిస్టర్లను తనిఖీ చేశారు. నెలలో తప్పనిసరిగా రెండుమార్లు అంగన్‌వాడీ కేంద్రాలకు కాంట్రాక్టర్ గుడ్లు సరఫరా చేయాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.



కోడిగుడ్డు బరువును పరిశీలిస్తున్న సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ


సచివాలయాలతో నూతన పాలనకు శ్రీకారం



మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి కొత్త పాలనకు శ్రీకారం చుట్టారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ వెంగన్న ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను వివరించారు. ప్రతి ఒక్కరికీ సురక్షితమైన తాగు నీరు అందించేందుకు పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనులు 67 శాతం పనులు పూర్తయ్యాయని, జూన్ 12వ తేదీ నాటికి పనులు పూర్తి చేస్తామని ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. ఎండీయూల ద్వారా ఇంటింటికి రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నామని, లోపాలుంటే తమ దృష్టికి తీసుకరావాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సీసీ రోడ్లు, సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్ల భవన నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని పంచాయతీ రాజ్ ఇంజినీర్ గణేష్ తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, వికలాంగులు వివాహమైన నెలలోపు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వెంగన్న తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రహదారులతో పాటు, బేతంచెర్ల నుంచి వెల్దుర్తి మండలం రామళ్ల కోట వరకు డబుల్ రహదారి పనులు, పట్టణంలోని అయ్యల చెర్వు నుంచి కస్తూర్బా వరకు నాల్గులైన్ల రహదారి పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. మండల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి సహకారంతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదద్దుతామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, ఏపీఎమ్ లింగమయ్య, ఏపీఓ శేషన్న, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, శ్రీరాములు, వేణుగోపాల్‌రెడ్డి, గుమ్మగాలరాజు, వైస్ ఎంపీపీలు రంగస్వామి, వెంకట సుబ్బమ్మ, ఎంపీటీసీలు రామచంద్రారెడ్డి, నాగేశు, మునేశ్వర్‌రెడ్డి, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి బుగ్గన



పాంషావలీ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన

బేతంచెర్ల : పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన పాంషావలి అనే యువకుడు కుక్క కరవడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఏప్రిల్ 22న మృతి చెందాడు. ఈ మేరకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి గురువారం మృతుడు పాంషావలీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ నాయకులు తిరుమలేశ్వర్‌రెడ్డి, మల్లికార్జున, నిరంజన్, రామనాయుడు, సాయి కిరణ్, ఆనంద్ పాల్గొన్నారు.

బేతంచెర్లకు వచ్చిన ఆరోగ్య శాఖ మంత్రి

ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని నంద్యాలలో పర్యటించిన అనంతరం బేతంచెర్ల పట్టణంలోని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్వగృహానికి వచ్చారు. డోన్ నియోజకవర్గంలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ చర్చించినట్లు సమాచారం.

నేడు తండా గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం

అవుకు: మండల పరిధిలోని తండా గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి గురువారం తెలిపారు. మర్రికుంటతండా, ఇస్రానాయక్ తండా, మన్నేనాయక్ తండాల్లో మధ్యాహ్నం 2.30గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారన్నారు. శనివారం కునుకుంట్లలో కార్యక్రమం ఉంటుందని, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొనాలని తెలిపారు.

వాగులో గల్లంతైన వృద్ధుడి కోసం గాలింపు

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం కమలపురి గ్రామ సమీపంలో పాలేరువాగులో బుధవారం రాత్రి ఇదే మండలం హోత్రమాన్‌దిన్నె గ్రామానికి చెందిన కంబగిరి అనే వృద్ధుడు గల్లంతయ్యాడు. వాగు దాటుతుండగా నీటి ప్రవాహంలో కొట్టుకపోయాడు. బంధువులు వాగు వెంట గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు గురువారం రంగప్రవేశం చేసిన పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు ఈ సందర్భంగా ఎస్ఐ ప్రతాప్ తెలిపారు.